

వికారాబాద్ డీపీఆర్వో బదిలీ



వికారాబాద్, ఫిబ్రవరి 15 : జిల్లా ప్రజా సంబంధాల శాఖ అధికారి మహమ్మద్ అరీఫుద్దీన్ గద్వాల డీపీఆర్వోగా బదిలీ అయ్యారు. గద్వాల డీపీఆర్వో చెన్నమ్మను వికారాబాద్ డీపీఆర్వోగా నియమిస్తూ సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీచేశారు. శుక్రవారం అరీఫుద్దీన్ గద్వాలలో విధుల్లో చేరనుండగా, చెన్నమ్మ సైతం వికారాబాద్ డీపీఆర్వోగా బాధ్యతలు స్వీకరించనున్నారు.



జిల్లాలో 50,540 ఎకరాల్లో
యాసంగి వరి

- చేలలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
- ఇన్‌చార్జి డీఏవో రమాదేవి

వికారాబాద్, ఫిబ్రవరి 15: వికారాబాద్ జిల్లాలో యాసంగి వరి సాగులో భాగంగా ఇప్పటి వరకు సుమారు 50,540 ఎకరాల్లో రైతులు నాట్లు వేశారని వ్యవసాయ శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి రమాదేవి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. యాసంగి వరి పైర్లు జిల్లాలో కొన్నిచోట్ల నారుమడి దశలోనూ, మరికొన్ని ప్రాంతాల్లో దుబ్బ(పిలక) పోసే దశలోనూ ఉన్నాయని తెలిపారు. కాగా ఎప్పటి లాగే ఈ దశలో పైరుపై కాండం తొలిచే పురుగు, రెక్కల పురుగుల ఉధృతి అధికంగా ఉందని గుర్తించి నట్లు ఆమె తెలిపారు. వీటి నివారణకు రైతులు వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు ఇచ్చే సూచనలు పాటించాలని ఆమె తెలిపారు. నారుమడి దశలో కాండం తొలిచే పురుగు నివారణకు నారుమడిలో కార్బోఫ్యురాన్ 3జీ గుళికలు లేదా 600గ్రాముల ఫిప్రోనిల్ 0.3జీ గుళికలను ప్రతీ ఎకరా నారుమడిలో చల్లాలన్నారు. ఒక వేళ నారుమడిలో గుళికలు వేయకుంటే పిలక దశలో ఉన్న పైరులోనూ కార్బోఫ్యురాన్ 3జీ గుళికలు పది కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు లేదా క్లోరంట్రానిలిప్రోల్ 0.4జీ గుళికలను నిర్ధారిత మోతాదుల్లో 20-25 కిలోల ఇసుకలో కలిపి బురద దుక్కిలో చల్లుకోవాలని అధికారి వివరించారు. అయితే మొగి పురుగు/కాండం తొలిచే పురుగు నివారణకు సిఫారసు చేసిన రసాయనాలు, ఇతర 10జీ లేదా సేంద్రియ గుళికలను యూరియాతో కలిపి చల్లితే ఎలాంటి ప్రయోజనం ఉండదని, రైతు సోదరులు ఇది గమనించాలని డీఏవో తెలిపారు.



- సునీతారెడ్డితో పాటు ఆమె కుమారుడు రినీష్‌రెడ్డి
- మధ్యాహ్నం 12 గంటలకు ముహూర్తం
- తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ నిర్ణయం
- ఉమ్మడి జిల్లా నుంచి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, అనుచరులు భారీగా తరలి రావాలని పిలుపు

హస్తం గూటికి సునీతా రెడ్డి

నేడు గాంధీభవన్‌లో దీపాదాస్ మున్షీ ఆధ్వర్యంలో చేరిక

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రాజకీయ పరిణామాలు రోజురోజుకూ మారుతున్నాయి. జిల్లాలో బీఆర్‌ఎస్ ఆధిపత్యాన్ని దెబ్బకొట్టేందుకు పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయోగాలు ఫలితాలు చూపుతున్నాయి. వికారాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబం బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి రావాలని నిర్ణయించుకోవడంతో కాంగ్రెస్‌లో ఉత్సాహాన్ని రేపుతోంది. ఇందులో భాగంగానే శుక్రవారం పట్నం మహేందర్‌రెడ్డి సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, వారి కుమారుడు రినీష్‌రెడ్డిలతో పాటు భారీగా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. వారు భారీ ర్యాలీగా వెళ్లి గాంధీభవన్‌లో రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్/ వికారాబాద్ ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ సీట్లే లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ పావులు కదుపుతోంది. కీలకమైన చేవెళ్ల స్థానం నుంచి బలమైన అభ్యర్థిని దింపాలని కసరత్తు చేస్తోంది. అయితే అందుకు తగ్గట్టే మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ఫ్యామిలీకి టికెట్ కేటాయించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన సతీమణి వికారాబాద్ జడ్పీ చైర్మన్ సునీతారెడ్డి ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఇందులో భాగంగా వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముహూర్తం ఖరారైంది. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు తన కుమారుడు పట్నం రినీష్ రెడ్డి, పలువురు పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆమె కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. గురువారం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు సునీతారెడ్డి ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం పునఃనిర్మాణం కోసం సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు సునీతారెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. పట్నం కుటుంబం అభిమానులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకు కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వెల్లడించారు. సునీతారెడ్డి, రినీష్‌రెడ్డితో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి తమ అభిమానులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు చెబుతున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల వరకు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తమ నివాసానికి తరలి రావాలని ఆమె పిలుపునిచ్చారు. తమ ఇంటినుంచి గాంధీభవన్ వరకు కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు సునీతారెడ్డి ప్రకటించారు.

నాడు శత్రువులు... నేడు మిత్రులు

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరని అంటారు. వికారాబాద్ జిల్లా రాజకీయాల్లో నిప్పు, ఉప్పుగా ఉన్న రేవంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి కుటుంబాలు ఇపుడు ఏకం కావడం విశేషం. 2018 ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఓటమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ అధిష్ఠానం అప్పటి మంత్రి పట్నం మహేందర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించింది.

అప్పుడు ఆయన తన సోదరుడు పట్నం నరేందర్ రెడ్డిని కొడంగల్ నుంచి రంగంలోకి దింపి.. తన అనుభవాన్ని, అధికారాన్ని ఉపయోగించి రేవంత్‌రెడ్డిని సొంత నియోజకవర్గంలో తొలిసారి ఓటమి పాలు చేశారు. ఆ తర్వాత రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి ఎంపీగా గెలవడం, పీసీసీ అధ్యక్షుడి పదవి పొందడంతో పాటు ఒంటి చేత్తో శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకు రావడం జరిగింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్‌లో తిరిగి రేవంత్‌రెడ్డితో తలపడిన మహేందర్‌రెడ్డి సోదరుడు నరేందర్‌రెడ్డి ఓటమి పాలయ్యారు. ఇప్పుడు అదే రేవంత్‌రెడ్డి సమక్షంలో పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు కాంగ్రెస్‌లో చేరనుండటం విశేషం.

చేవెళ్ల ఎంపీ టికెట్ ఖరారు?

వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి చేవెళ్ల ఎంపీ టికెట్ ఆశిస్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతోనే వారు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పార్టీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. తాండూరు ఎమ్మెల్యే టికెట్ మహేందర్‌రెడ్డి ఆశించగా మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ కేటాయించింది. దీంతో పాటు మరో నేత మెతుకు ఆనంద్‌తో నెలకొన్న విభేదాల కారణంగానే మహేందర్ రెడ్డి దంపతులు బీఆర్‌ఎస్‌ను వీడుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా చేవెళ్ల ఎంపీ టికెట్‌పై మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆశలు పెట్టుకున్నారు. తనకు ఎంపీ టికెట్ వస్తుందనే నమ్మకంతో ఉన్నారు. టికెట్ కోసం గట్టి ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.

హ్యాట్రిక్ జడ్పీ చైర్‌పర్సన్.. పదేళ్లకు బీఆర్‌ఎస్‌కు గుడ్ బై..!

సునీతారెడ్డి హ్యాట్రిక్ జడ్పీ చైర్‌పర్సన్‌గా ఘనత సాధించారు. రెండు పర్యాయాలు ఉమ్మడి రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహించిన సునీతారెడ్డి ప్రస్తుతం వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. మూడుసార్లు జడ్పీ చైర్‌పర్సన్‌గా చేసిన ఘనత సునీతారెడ్డికే దక్కింది. 2006లో టీడీపీలో చేరి రాజకీయ రంగ ప్రవేశం చేసిన సునీతారెడ్డి ఆ ఏడాదిలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీగా విజయం సాధించి జడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. 2011లో రెండోసారి జడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఆమె 2014 ఎన్నికలకు ముందు తన భర్త పట్నం మహేందర్‌రెడ్డితో పాటు ఆయన సోదరుడు పట్నం నరేందర్ రెడ్డి తదితరులు టీడీపీకి రాజీనామా చేసి కేసీఆర్ సమక్షంలో టీఆర్‌ఎస్ (బీఆర్‌ఎస్)లో చేరారు. ఇదిలా ఉంటే, రెండేళ్ల కిందట మర్పల్లి మండలం పట్లూరులో స్వంత పార్టీ నాయకులే తన వాహనాన్ని అడ్డుకుని వీరంగం సృష్టించిన ఘటనపై అధిష్ఠానం స్పందించక పోవడం పట్ల ఆమె తీవ్ర ఆవేదనకు గురయ్యారు, అప్పటి మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పట్నం మహేందర్‌రెడ్డి, సునీతారెడ్డి, నరేందర్‌రెడ్డి, అప్పటి వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తదితరులను హైదరాబాద్‌కు పిలిపించి వారి మధ్య సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించినా ఆమె తన అసంతృప్తిని వెళ్లగక్కారు. అప్పటి నుంచి చాలావరకు ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు దూరం ఉంటూ వచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆమె పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం చేయకుండా దూరంగా ఉన్నారు. కొంతకాలంగా మహేందర్‌రెడ్డి దంపతులు కాంగ్రెస్ పార్టీలో చేరతారనే ప్రచారం జరిగింది. చివరకు శుక్రవారం సునీతారెడ్డి, ఆమె కుమారుడు రినీష్‌రెడ్డి తమ అభిమానులు, వెంట వచ్చే నాయకులు, కార్యకర్తలతో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. సునీతారెడ్డి రెండు పర్యాయాలు టీడీపీ నుంచి జడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నిక కాగా, మూడోసారి బీఆర్‌ఎస్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. కాగా, దశాబ్ద కాలం పాటు బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగిన సునీతారెడ్డి ఎట్టకేలకు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ గూటికి చేరనున్నారు.

ముగిసిన ఈవీఎంల పరిశీలన ప్రక్రియ : కలెక్టర్



మాక్ పోలింగ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 15: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎంల మొదటి దశ పరిశీలన ప్రక్రియ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో 12మంది ఈసీఎల్‌కు చెందిన సాంకేతిక నిపుణుల ఆధ్వర్యంలో సుమారు 80 మంది సిబ్బందితో ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ ముగిసిందని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ గిడ్డంగి యంత్రాల మొదటి దశ పరిశీలన పూర్తి అయిన అనంతరం మాక్ పోలింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఎఫ్ఎల్‌సీ నిర్వహిస్తున్న సాంకేతిక నిపుణులతో ఇప్పటి వరకు జరిగిన ప్రక్రియ, మాక్ పోలింగ్‌పై వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి మొదలైన ఈ ప్రక్రియ ఎన్నికల నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల మొదటి దశ పరిశీలన పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి



కార్మికులతో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకుడు శివబాబు

కీసర రూరల్, ఫిబ్రవరి 15 : కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం(నేడు) నిర్వహించే భారత్ బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి. శివబాబు పిలుపునిచ్చారు. నాగారం పరిధి రాంపల్లిలో గురువారం నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలతో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం అయిందన్నారు. కొత్త లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, 8 గంటల పనికాలం అమలు చేయాలనే తదితర డిమాండ్లతో బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి డి.యాదయ్య, నాయకులు వీరస్వామి, జి.స్వామి, జి.కుమార్, పోచయ్య, బసవయ్య, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పునరుజ్జీవనానికి కళలు దోహదం

- ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్
- అన్నోజిగూడలో ఘనంగా స్వర ఝరి



స్వర ఝరి కార్యక్రమాన్ని తిలకిస్తున్న ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్, తదితరులు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 15: భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనానికి కళలు దోహదపడతాయని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘ్ చాలక్ డాక్టర్ మోహన్‌భగవత్ అన్నారు. గురువారం మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధి అన్నోజిగూడలోని శ్రీవిద్యా విహార్ హైస్కూల్ మైదానంలో జరిగిన స్వర ఝరి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు సంగీత అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గంటన్నర పాటు సాగిన స్వర ఝరిలో కళాకారులు వివిధ రకాలు సంగీత వాయిద్యా పరికరాలను వాయించారు. ప్రత్యేకంగా ఎంపిక చేసిన 81 మంది ఘోష్ వాదకులు స్వర ఝరిని నిర్వహించారు. శంకు, వేణు, శృంగ, ఆనక్, షవణ, ఝుల్లరి, త్రిభుజి వాయిద్యాలను వాయించారు. ఇందులో భాగంగా కార్యక్రమంలో కళాకారులు శివలింగం, త్రిశూల వ్యూహం, రామ మందిరం నమూనా, కోదండం, నౌకాదళ చిహ్నం, శివాజీ కాలం నాటి అష్టభుజ, ఆధునిక యుద్ధనౌక తేజస్, విక్రమ్ ల్యాండర్, రోవర్ నమూనాలతో పాటు చాలకులు సంఘ్ సమత(కవాతు) ప్రదర్శనలు నిర్వహించారు. పెద్దపులి పాట, లింగాష్టకం, రామ్.. సియా రామ్, సైడ్ డ్రమ్ ప్రజెంటేషన్ వంటి సంగీత కార్యక్రమాలను వీనుల విందుగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ చలనచిత్ర సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, ఏఎం రత్నం, ఎల్లా వెంకటేశ్వర్‌రావు, ఆర్పీ పట్నాయక్, కొమందూరి రామాచారి, కేఎం.రాధాకృష్ణ, ఎంఎం.శ్రీలేఖ, సంగీత విధ్వాంసులు ప్రేమరామ్మూర్తి, రమాప్రభ, ఎల్లా బాలమురళి, వనజా ఉదయ్, జయప్రదరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



సంగీత పరికరాలను వాయిస్తున్న ఘోష్ వాదకులు

చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదు

- పరిశీలించిన కమిషన్ సభ్యులు

గచ్చిబౌలి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : చెరువులు అన్యాక్రాంతమవుతున్నాయని ఫిర్యాదులు రావడంతో హైకోర్టు నియమించిన కమిషన్ సభ్యులు గురువారం శేరిలింగంపల్లి మండలంలోని మాదాపూర్ దుర్గం చెరువు, గుట్టల బేగంపేటలోని సున్నంచెరువు, నానక్‌రాం గూడలోని మేడికుంట, గౌలిదొడ్డిలోని గోసాయికుంట, నల్లగండ్లలోని పెద్ద చెరువు, చందానగర్‌లోని గంగారం పెద్ద చెరువులను పరిశీలించారు. త్వరలోనే హైకోర్టుకు నివేదిక సమర్పిస్తామని వారు తెలిపారు. వీరి వెంట సర్వే అండ్ ల్యాండ్ రికార్డు అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రాములు, రాజేంద్రనగర్ మండల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేస్ వెంకటేష్, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, జీహెచ్ఎంసీ, నీటిపారుదల శాఖ అధికారులు వంశీకృష్ణ, నళిని, బాల్‌రెడ్డి, మాదాపూర్, గచ్చిబౌలి, చందానగర్ పోలీస్ స్టేషన్లకు చెందిన అధికారులు ఉన్నారు. శేరిలింగంపల్లి, మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో చెరువులు అన్యాక్రాంతమవుతున్నాయని ఫిర్యాదులు రావడంతో హైకోర్టు చీఫ్ జస్టిస్, హైకోర్టు న్యాయవాది ప్రవీణ్‌కుమార్, పీపీ శ్రీకాంత్‌రెడ్డితో కమిషన్‌ను ఏర్పాటు చేశారు.





దుర్గం చెరువును పరిశీలిస్తున్న కమిషన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు

ముమ్మరంగా గృహజ్యోతి వివరాల సేకరణ

మేడ్చల్ ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వ హామీ మేరకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలుకు తెలంగాణ రాష్ట్ర దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో వినియోగదారుల వివరాలను ట్రాన్స్‌కో సిబ్బంది సేకరిస్తున్నారు. విద్యుత్ మీటరు నంబరు, వినియోగదారుడి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్లను నమోదు చేస్తున్నారు. వివరాల నమోదు ఈ నెల 7న ప్రారంభం కాగా 15వ తేదీ చివరి తేదీగా మొదట ప్రకటించారు. ప్రభుత్వం తిరిగి 20వ తేదీ వరకు గడువు పెంచుతూ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసి ంది. జిల్లాలో 2,80,000 మంది కేటగిరి-1 కింద గృహ విద్యుత్ వినియోగదారులున్నారు. గృహజ్యోతి స్కీమ్ అమలు కోసం వీరి వివరాలు సేకరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విద్యుత్ సిబ్బంది వినియోగదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 75,176 మంది గృహ వినియోగదారుల వివరాలను మాత్రమే సేకరించారు. గడువులోగా వివరాల సేకరణ పూర్తవుతుందా లేదా అనే సందేహం ఉన్నా దీనిని నిరంతర ప్రక్రియ కొనసాగించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.



మేడ్చల్‌లో గృహజ్యోతి దరఖాస్తులను స్వీకరిస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు

ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు

విద్యుత్ వినియోగదారుల వివరాల సేకరణ గడువు దగ్గర పడుతుండటంతో విద్యుత్ సిబ్బంది జిల్లాలో ప్రత్యేక వాహనాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. వినియోగదారులు తమకు సంబంధించిన వివరాలను సిబ్బందికి గానీ, లేదా సమీపంలోని విద్యుత్ కార్యాలయంలో గానీ అందజేయాలని ప్రచారం చేస్తున్నారు. జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో పనిచేసే సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ట్రాన్స్‌కో రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. దీనితో పాటు ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద, కూడళ్ల వద్ద కౌంటర్‌లు ఏర్పాటు చేసి వినియోగదారుల వివరాలు సేకరిస్తున్నారు. సిబ్బంది వినియోగదారుల ఇంటికి వెళ్లినా వివరాలు ఇవ్వడానికి కొందరు ముందుకు రావడం లేదని విద్యుత్ అధికారులు తెలుపుతున్నారు.

ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుంది

గృహజ్యోతి పథకం కింద విద్యుత్ వినియోగదారుల వివరాల సేకరణ వేగంగా జరుగుతోంది. గృహ వినియోగదారులు తమ వివరాలు అందజేయాలని ప్రచారం చేస్తున్నాం. విద్యుత్ ఉద్యోగులతో పాటు సిబ్బంది రోజూ ఉదయం నుంచి రాత్రి 8గంటల వరకు వివరాలు సేకరిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వివరాల సేకరణ పూర్తి చేస్తాం. నిరంతరంగా ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ప్రత్యేక కౌంటర్‌లు కూడా ఏర్పాటు చేశాం. ఈ పథకాన్ని వినియోగదారులు సద్వినియం చేసుకోవాలి.

- శ్రీనాథ్‌రెడ్డి, డీఈ, మేడ్చల్

విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించాలి

● పరిశ్రమల శాఖ జిల్లా జీఎం వినయ్ కుమార్


మాట్లాడుతున్న వినయ్‌కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 15 : ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సీఎస్‌సీ కేంద్రాల ఆపరేటర్లు, గ్రామ పంచాయతీల కార్యదర్శులకు పరిశ్రమలశాఖ జిల్లా జనరల్ మేనేజర్ వినయ్ కుమార్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఎంఎస్‌ఎంఈ, జిల్లా పరిశ్రమల కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ పథకంపై జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. లబ్ధిదారులు మీసేవ కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్‌కార్డు, మొబైల్ నెంబర్, బ్యాంకు వివరాలతో పాటు రేషన్‌కార్డు వంటి పత్రాలను సమర్పించాలని తెలిపారు. ఎంఎస్‌ఎంఈ ఏడీ సుధీర్ కుమార్, ఎస్‌బీఐ ఆర్‌ఎం (క్రెడిట్) వికాస్ సాహా, ఎల్‌డీఎం రాంబాబు, మెప్మా పీడీ రవికుమార్, బీసీ సంక్షేమ శాఖ జిల్లా సహాయ అధికారి భీమ్ రాజు, సీఎస్‌సీ ఆపరేటర్లు, ఔత్సాహిక విశ్వకర్మలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్రమార్కులకు అండగా నిలిచిన బీఆర్‌ఎస్

● మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, ఫిబ్రవరి 15 : చెరువుల సుందరీకరణ పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అక్రమార్కులకు అండగా నిలిచిందన్నారు. వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాల ప్రణాళికలు తయారు చేసిందన్నారు. నియోజకవర్గం పరిధిలో సుందరీకరణపేరుతో కబ్జాలకు గురైన చెరువులు, కుంటలను త్వరలో రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలిస్తారని తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ధరణిని అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా ప్రభుత్వ భూములను బీఆర్‌ఎస్ పెద్దలకు అప్పజెప్పిన పలువురు అవినీతి అధికారులను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. అదే విధంగా చెరువుల పరిరక్షణ సమితి సహా పర్యావరణ పరిరక్షణసభ్యులు, అఖిలపక్షం నాయకులు చెరువుల పునరుద్ధరణ కార్యక్రమానికి సహకరించాలని కేఎల్‌ఆర్ కోరారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేఎల్‌ఆర్

కాంగ్రెస్ కంచుకోటగా మహేశ్వరం

మహేశ్వరాన్ని కాంగ్రెస్ కంచుకోటగా చేసి పార్టీకి పూర్వ వైభవం తేవాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కార్యకర్తలను కోరారు. గురువారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, మహిళా కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకులు చిగిరింత నర్సింహ్మారెడ్డి, ఏనుగుజంగారెడ్డి, సత్యనారాయణ, పద్మ, యాదయ్య పాల్గొన్నారు.

ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియ పూర్తి

మేడ్చల్ ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియను కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పూర్తి చేశారు. ఈ నెల 5న ప్రారంభమైన ఈవీఎం, వీవీప్యాట్, బ్యాలెట్ బాక్స్ ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియ గురువారం నాటికి పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. 26 మంది ఈసీఎల్ ఇంజనీర్ల బృందం సహకారంతో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను చెకింగ్ చేసినట్లు చెప్పారు. 14, 15 తేదీలలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించిన అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌లో భద్రపరిచి సీల్ చేశామన్నారు. డీఆర్వో హరిప్రియ, తహసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డి, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


గోడౌన్‌కు సీల్ వేస్తున్న అధికారులు

నేటి నుంచి అగ్రిటెక్ దక్షిణాది సదస్సు

వికారాబాద్, ఫిబ్రవరి 15 : భారతీయ పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) ఆధ్వర్యంలో తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నేటి నుంచి ఈనెల 18 వరకు రైతులకు అగ్రిటెక్ దక్షణాది సదస్సు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి పాల్గొంటారని, వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులు తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చిస్తారని తెలిపారు.

ఐదేళ్ల పిల్లలకు పోలియో చుక్కలు

వికారాబాద్, ఫిబ్రవరి 15 : పుట్టిన శిశువు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయించి అంగవైకల్యం రాకుండా చూడాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ మురారి రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో 2024 పల్స్ పోలియోపై ఒకరోజు శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి అక్కడ ఉన్న పిల్లలకు కూడా పోలియో చుక్కలు వేయాలని, అలాగే బస్టాండ్ రైల్వేస్టేషన్‌లలో కూడా పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ బుచ్చిబాబు, జిల్లా వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


శిక్షణలో పాల్గొన్న వైద్యాధికారులు

ఎస్ఐల బదిలీలు

వికారాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లాలో ఆరుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. కులకచర్ల ఎస్‌ఐగా పనిచేస్తున్న శ్రీశైలం బంట్వారంకు బదిలీ కాగా, వికారాబాద్ ఎస్‌ఐగా పనిచేస్తున్న అన్వేష్ కుమార్‌ను కులకచర్లకు బదిలీ చేశారు. బంట్వారం ఎస్‌ఐగా పనిచేస్తున్న ఆనంద్ కుమార్‌ను దోమకు బదిలీ చేయగా, దోమ ఎస్‌ఐ రవిని వీఆర్‌లో ఉంచారు. వీఆర్‌లో ఉన్న ఎం కాశీనాథ్‌ను, తాండూరు ఎస్‌ఐగా, జీవీ సత్యనారాయణను వికారాబాద్ ఎస్‌ఐగా బదిలీ చేశారు.

గనుల శాఖకు పెరిగిన ఆదాయం


ఎర్రమట్టి క్వారీ

తాండూరు, ఫిబ్రవరి 15 : సుద్ద, ఎర్రమట్టిపై రాయల్టీ రూపంలో గనుల శాఖకు ఈ ఏడాది రెట్టింపు ఆదాయం వచ్చింది. గతేడాది మార్చి నాటికి సుద్దపై రూ2 కోట్ల 23లక్షల ఆదాయం రాగా, ఈ ఏడాది ఫిబ్రవరి 10 నాటికే రూ. 5 కోట్ల 52 లక్షల ఆదాయం సమకూరింది. గత ఏడాది ఎర్రమట్టిపై రూ. 51 కోట్ల 20 లక్షల ఆదాయం రాగా ఈసారి రూ. 57 కోట్ల 55 లక్షల ఆదాయం వచ్చింది. కంకరపై గత ఏడాది రూ. 3 కోట్ల 79 లక్షల ఆదాయం రాగా ఈ సంవత్సరం రూ. 3 కోట్ల71 లక్షల ఆదాయం సమకూరింది. సుద్ద, ఎర్రమట్టి తవ్వకాలు తరలింపుపై మైన్స్ శాఖ రాయల్టీ తప్పనిసరి నిబంధన పెట్టడంతో పాటు తనిఖీలు చేయడం, అక్రమాలకు కళ్లెం వేయడంతో ఆదాయం పెరిగింది.

ఈ ఏడాది లక్ష్యం రూ. 113 కోట్లు..

జిల్లాలో ఈ ఏడాది మైన్స్ శాఖ రూ.113 కోట్ల ఆదాయాన్ని పొందాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు రూ. 92 కోట్ల ఆదాయం వచ్చింది. మార్చి నాటికి లక్ష్యం చేరుతామని మైన్స్ ఏడీ జాకబ్ చెప్పారు. గతేడాది రూ. 88 కోట్ల 50 లక్షలు లక్ష్యం పెట్టుకోగా రూ.97 కోట్ల 39 లక్షల ఆదాయం వచ్చింది.

ఆదాయం తెస్తున్న ఖనిజ సంపద


ఎర్ర మట్టి 54 లీజులు, కంకర 24, సుద్ద 22, నాపరాయి 57, నల్లగ్రానైట్ 3, సున్నపురాయి 3, సిమెంట్ కర్మగారాలు 7 లీజుల రాయల్టీ ద్వారా పై ఆదాయం వస్తోంది.

మాతాశిశు మరణాలపై సమీక్ష


సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో


మేడ్చల్ ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వైద్యాధికారులతో డీఎంహెచ్‌వో రఘునాధస్వామి తన కార్యాలయంలో గురువారం మాతా, శిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. పిల్లల మరణాలకు గల కారణాలలో భౌగోళిక వైవిధ్యాన్ని అర్థం చేసుకొని, ప్రసూతి సంరక్షణ చర్యలను మెరుగుపరచాలని ఆయన అన్నారు. అప్పుడే మాతా శిశు మరణాలను తగ్గించడం వీలవుతుందని చెప్పారు. వైద్యులు గీతాప్రసాద్, పద్మావతి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు, జవహర్‌నగర్, కీసర, ఉప్పల్, దుండిగల్, జగద్గిరిగుట్ట వైద్యాధికారులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో 5కే రన్


5కే రన్‌ను ప్రారంభిస్తున్న మల్లారెడ్డి

మేడ్చల్ ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ ఆఫ్ ఉమెన్స్‌లో గురువారం నిర్వహించిన '5కే రన్ ఫర్ ఈక్వాలిటీ'ని ఎమ్మెల్యే మల్లారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి రన్‌లో పాల్గొన్నారు. అనంతరం మల్లారెడ్డి యూనివర్సిటీ, స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్‌లో బీఎస్సీ అగ్రికల్చర్ నాలుగవ సంవత్సరం చదువుతున్న 43 మంది విద్యార్థులు లెర్నింగ్ కోసం అమెరికా వెళుతున్న సందర్భంగా వారికి అభినందనలు తెలియజేశారు. ఇటీవల హాస్టల్‌లో ఆహారం నాణ్యంగా ఉండడంలేదని విద్యార్థులు ఆందోళన నిర్వహించడంతో ఉదయం విద్యార్థులతో కలిసి ఆయన హాస్టల్‌లోనే టిఫిన్ చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దైవచింతనతోనే ప్రశాంతత


పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల, ఫిబ్రవరి 15 : దైవచింతనతోనే ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్స్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో పోచమ్మగుడి మూడవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీంభరత్, సత్యనారాయణరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ లొంక శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ కొత్తకాపు నర్సింహారెడ్డి, గ్రామస్థులు, ఉన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి


ధారూరు: మైలారం ముందలి తండాలో సేవాలాల్ జయంతి వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనంద్


పెద్దేముల్: ఊరెంటితండాలో శ్రీసంత్‌సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే


పరిగి: సేవాలాల్ జయంతి ఉత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, తదితరులు

కొడంగల్, ఫిబ్రవరి 15: గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాలను కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, దుద్యాల మండల కేంద్రాల్లో గిరిజనులు ఘనంగా నిర్వహించుకున్నారు. కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తా నుంచి గురువారం సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటాన్ని, పూలమాలలతో క్రేన్ సహాయంతో ఆవిష్కరించారు. గిరిజనులు సంప్రదాయ పద్ధతితో ఆటాపాటలతో ఆకట్టుకున్నారు. అనంతరం కొడంగల్ పట్టణ శివారులోని సిద్దనొంపు సమీపంలో బంజారాభవన్ దగ్గర సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి గిరిజనులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, టీపీసీసీ ప్రతినిధి ఎండీ. యూసుఫ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ పాల్గొన్నారు. అదేవిధంగా కొడంగల్ పట్టణ శివారులోని బీసీ గురుకుల పాఠశాలలో సేవాలాల్ మహారాజ్ జయంతిలో లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సూర్యనాయక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకర్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని బోట్లవనితండాలో సేవాలాల్ మహారాజ్, మరియమ్మ మాత మహాభోగ్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు దేశ్యానాయక్, నెహ్రూనాయక్, రాజునాయక్, సోమ్‌నాథ్, నర్సింహా, బీఆర్‌ఎస్ నాయకులు కోట్ల యాదగిరి, తిరుపతయ్య, శ్రావణ్‌గౌడ్, మధుసూదన్‌యాదవ్, కోట్ల మహిపాల్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా గురువారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలో ఉత్సవాలను గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా సంప్రదాయ పద్దతిలో గిరిజనులు ఆటాపాటలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు డి.వెంకట్, తహసీల్దార్ మనోహర చక్రవర్తి, మాజీ సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, కాశీరాం, రవీందర్, విజయ్‌కుమార్, జయరామ్, చరణ్‌సింగ్, శివకుమార్, రాములు, విఠల్, గణపతి, సీతారాం, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండలంలోని కేశవపల్లి తండాలో సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జానకిరామ్ మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవం సంత్‌సేవాలాల్ మహారాజ్ అన్నారు.

తాండూరు: గిరిజన ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి గురువారం తాండూరులో ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జడ్పీటీసీ ధారాసింగ్, కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, నీరజ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవాలాల్ మహారాజ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ప్రచురించాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్‌నాయక్ డిమాండ్ చేశారు. భూకైలాస్ వ్యవస్థాపకులు వాసుపవర్, కౌన్సిలర్ భీంసింగ్ రాథోడ్, కోఆప్షన్‌సభ్యులు వెంకట్‌రాంలతో కలిసి గురువారం సేవాలాల్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

కులకచర్ల: మండలంలోని పలు గిరిజన తండాల్లో, గ్రామాల్లో గిరిజనులు సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలను జరుపుకున్నారు. కులకచర్లలో చిన్నగేటు నుంచి చౌరస్తా మీదుగా ఫంక్షన్‌హాలు వరకు పెద్దఎత్తున ఊరేగింపు నిర్వహించారు. యువకులు, మహిళలు ఆటాపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జడ్పీటీసీ రాందాస్‌నాయక్, గిరిజన సంఘం నాయకులు జానకిరామ్, శంకర్‌నాయక్, విఠల్‌నాయక్, శివరాంనాయక్ పాల్గొన్నారు.

పూడూరు: మండలంలోని తిర్మలాపూర్‌తండాలో సంత్ సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. తండాలో గిరిజన యువకులు, మహిళలు గురువారం సంత్ సేవాలాల్‌కు బోగ్‌బండర్ నిర్వహించారు. అనంతరం పరిగిలో జరిగిన సమావేశానికి యువకులు బైక్‌పై ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సేవాలాల్ అందరికీ ఆదర్శనీయమన్నారు.

ధారూరు: సేవాలాల్ జయంతిని మండలంలోని తండాల్లో గురువారం గిరిజనులు ఘనంగా నిర్వహించారు. మైలారం ముందలితండాలో జరిగిన సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొని సేవాలాల్ చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం పలు తండాల్లో గిరిజనులు సేవాలాల్ చిత్రపటాలతో ఊరేగింపు, బైక్‌ర్యాలీలు నిర్వహించారు.

పెద్దేముల్: ఊరెంటి తండాలో శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని గురువారం తండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఇందూరు గ్రామంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు.

బషీరాబాద్: మండలకేంద్రంలో సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని గురువారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆవిష్కరించారు. సేవాలాల్ కమిటీ అధ్యక్షుడు రామునాయక్ ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని బంజారా నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాండూరులో బంజారాభవన్ ఏర్పాటుకు కృషి చేస్తానని, వచ్చే ఏడాది నూతన భవనంలో వేడుకలు నిర్వహించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరుణ అయజ్‌ప్రసాద్, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, సేవాలాల్ కమిటీ అధ్యక్షుడు రామునాయక్, ఉపాధ్యక్షులు భస్సీలాల్, ప్రధానకార్యదర్శి నరేష్‌చౌహాన్, మాజీ వైస్‌ఎంపీపీ ఎస్.వెంకటేష్, కాంగ్రెస్ యువనాయకులు రోహిత్‌మహరాజ్ పాల్గొన్నారు.

పరిగి: పరిగిలో సేవాలాల్ జయంతి సందర్భంగా చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పరిగిలో ర్యాలీ నిర్వహించారు. శ్రీలక్ష్మీ వెంకటేశ్వస్వామి ఆలయం, టెలిఫోన్ ఎక్స్ఛేంజీ నుంచి బహార్‌పేట్, కేఎస్‌ఆర్ గార్డెన్ వరకు గిరిజనులు డ్యాన్సులతో భారీ ఊరేగింపు నిర్వహించారు. గిరిజన సంప్రదాయ నృత్యాలతో ఊరేగించారు.


తాండూరు: సేవాలాల్ జయంతి ఉత్సవంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

ఘట్‌కేసర్: లంబాడీలు ఐక్యంగా ఉంటూ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో పయనించాలని మాజీ ఎంపీ రవీందర్ నాయక్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో గురువారం గోర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్.శేఖర్, కౌన్సిలర్లు రమాదేవి మహిపాల్‌గౌడ్, సంగీతా ప్రభాకర్‌రెడ్డి, నాయకులు రాములు నాయక్, చరన్‌దాస్ పవార్, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

కీసర రూరల్: లంబాడాల ఆరాధ్య దైవం సంత్‌సేవాలాల్ అని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ ఇందిరా ప్రియదర్శిని కాలనీలో గురువారం సంత్‌సేవాలాల్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, సేవాలాల్ సేవా సంస్థ ప్రతినిధులు సిద్దులు, రవినాయక్, వెంకటేష్, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.


మూడుచింతలపల్లి: సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో లింగాపూర్ తండావాసులు

మూడుచింతలపల్లి: గిరిజనుల అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని లింగాపూర్ తండా వాసులు అన్నారు. మండలంలోని లింగాపూర్ తండా గ్రామంలో గురువారం సద్గురు సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లింగాపూర్ తండా గ్రామ పంచాయితీ ధర్మ ప్రచార సుధాకర్‌నాయక్, లక్ష్మణ్ నాయక్, రాములు నాయక్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తల్లిని వేధిస్తున్న తండ్రిని హతమార్చిన కొడుకు

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 15: రోజూ తల్లిని తిడుతూ, కొడుతూ వేధింపులకు గురిచేస్తున్న తండ్రిని తనయుడు హతమార్చాడు. ఈ ఘటన మండలంలోని చంద్రయాన్‌పల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ అరవింద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పుంటి కూర నర్సింహులు(55) తన భార్య జయమ్మ, ఇతర కుటుంబసభ్యులను రోజూ చిత్రహింసలు పెడుతూ ఇబ్బందులకు గురిచేసేవాడు. తండ్రి అరాచకాన్ని తట్టుకోలేని కొడుకు అనంతరాములు బుధవారం రాత్రి ఇంటి సమీపంలో కత్తితో తండ్రిపై దాడిచేసి హత్య చేశాడు. తన తండ్రి రోజూ తల్లిని కొట్టడం, తిట్టడం చేస్తూ వేధిస్తున్నాడని, అడ్డగించే వారిపైనా దాడులకు పాల్పడుతున్న కారణంగానే హతమార్చినట్లు కొడుకు అనంతరాములు చెప్పాడని ఎస్‌ఐ తెలిపారు. తండ్రి వేధింపుల నుంచి తల్లికి విముక్తి కల్పించేందుకే కొడుకు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు ప్రాథమికంగా తెలుస్తోందని ఎస్‌ఐ చెప్పారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించామన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 15: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన బొంరాస్‌పేట్ మండలంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని మహంతీపూర్ గ్రామానికి చెందిన అచ్చమొల్ల చిన్నయ్య అలియాస్ చంద్రయ్య పనినిమిత్తం బొంరాస్‌పేట్‌కు వచ్చాడు. ఈ క్రమంలో తిరుగు ప్రయాణంలో బైక్‌పై సొంత గ్రామానికి వెళ్తుండగా బొట్లవనితండా సమీపంలో 163వ జాతీయ రహదారిలో మినీవ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 15: బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో చికిత్స పొందుతున్న ఓవ్యక్తి గురువారం మృతిచెందాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ గోవర్ధనగిరి తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మున్సిపాలిటీ రాంపల్లికి చెందిన డప్పు ప్రశాంత్(32) తన సోదరుడు డప్పు శ్రీకాంత్‌తో కలిసి బైక్‌పై ఈనెల 13వ తేదీన ఘట్‌కేసర్ వెళ్లారు. పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వస్తుండగా ఘట్‌కేసర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం సమీపంలోకి రాగానే బైక్‌ను ఇన్నోవా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రశాంత్ తలకు బలమైన గాయమైంది. అతడి కడుపులో పేగులు బయటకు వచ్చాయి. శ్రీకాంత్‌కు సైతం తీవ్రగాయాలు కావడంతో 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రశాంత్ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా కారు నడపడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురిపై కేసు నమోదు

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 15: మండల కేంద్రం శివారులో గురువారం ఐదుగురు వ్యక్తులు పేకాడుతూ పట్టుబడ్డారు. ఎస్‌ఐ అరవింద్ తెలిపిన వివరాల మేరకు.. పేకాడుతున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా ఐదుగురు పట్టుబడినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5810 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



ఘట్‌కేసర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని రాస్తారోకో నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 15: ఘట్‌కేసర్‌లో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఏబీవీపీ విద్యార్థులు రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా అసంఘం నాయకులు శ్యామ్‌కిరణ్ మాట్లాడుతూ మేడ్చల్ నియోజక వర్గంలో డిగ్రీ కళాశాల లేకపోవడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పనిచేసిన చామకూర మల్లారెడ్డి విద్యాభివృద్ధికి చేసిన కృషి శూన్యమన్నారు. ఇప్పటికైన డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాను, సచిన్, నవీన్, శివ, నాగరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్‌గోముల్‌ను సందర్శించిన సీఐ


చెన్‌గోముల్ పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్

పూడూరు, ఫిబ్రవరి 15 : మండలంలోని చెన్‌గోముల్ పోలీసు స్టేషన్‌ను పరిగి సీఐ శ్రీనివాస్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి తగు సూచనలు చేశారు. పోలీసులు ప్రజలతో మంచి సంబంధాలు కలిగి ఉండాలన్నారు. ఫిర్యాదులు చేసేందుకు వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా మెలగాలని పేర్కొన్నారు. పోలీసులంటే ప్రజలు భయపడేలా కాకుండా గౌరవించేలా వ్యవహరించాలని చెప్పారు.

ఎస్‌ఐ రవిగౌడ్‌పై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

తాండూరురూరల్, ఫిబ్రవరి 15: భూవివాదంలో జోక్యం చేసుకుని బాధితులను ఇబ్బందులకు గురిచేస్తున్న దోమ ఎస్‌ఐ రవిగౌడ్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తాండూరులో గురువారం సీఐటీయూ, వ్యవసాయ కార్మికసంఘం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అధికార పార్టీకి చెందిన కబ్జాదారులకు ఎస్‌ఐ, డీఎస్పీ సహకరిస్తున్నారని ఆరోపించారు. భూమి విషయంలో పోలీసులు జోక్యం చేసుకోరాదని వారు పేర్కొన్నారు. డీజీపీ స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపి డీఎస్పీ, ఎస్‌ఐలపై చర్యలు సుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే 19వ తేదీన తోమ తహసీల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అయ్యూబ్, అమీర్, హన్మంత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్‌లో చేరనున్న వడ్ల నందు

వికారాబాద్, ఫిబ్రవరి 15: బీఆర్‌ఎస్ నాయకుడు వడ్ల నందు నేడు(శుక్రవారం) కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డిలకు ముఖ్య అనుచరుడైన నందు శుక్రవారం సునీతారెడ్డితో పాటు ఆయన కూడా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను వెంటనే డెలివరీ చేయాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 15: 2022- 23 సంవత్సరం ఒక సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను వెంటనే డెలివరీ చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పౌరసరఫరాల అధికారులు రైస్‌మిల్లర్లతో సీఎంఆర్ రైస్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి మాసాంతం వరకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైస్ మిల్లర్లు తమ వద్ద నిలువగా ఉన్న సీఎంఆర్ రైసును 100శాతం ఎఫ్‌సీఐకి డెలివరీ చేయాలని ఆదేశించారు. పౌరసరఫరాలో డిప్యూటీ తహసీల్దార్లు అందరూ ప్రతీ రోజు మిల్లుల వద్దకు వెళ్లి సీఎంఆర్ డెలివరీ అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. నిర్దేశించిన సమయంలో డెలివరీ చేయకుంటే తక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ కొండలరావు, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, రైస్‌మిల్లుల సంఘం అధ్యక్షులు బాలేశ్వర గుప్తా, సెక్రటరీ శ్రీధర్ రెడ్డి, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

సోమన్‌కుర్తిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సైబెజ్ ఆశ ప్రతినిధులు, స్థానికులు

పూడూరు, ఫిబ్రవరి 15: సోమన్‌గుర్తిలో హైదరాబాద్ గచ్చిబౌలి సైబెజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో సైబెజ్ ఆశ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులకు ఆ కంపెనీ ప్రతినిధులు గురువారం శంకుస్థాపన చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సైబెజ్ ఆశ కార్యక్రమం ద్వారా గ్రామంలో రూ.9.60లక్షలతో 240మీటర్ల సీసీ రోడ్డు పనులు చేపట్టి పూర్తి చేశారు. అట్టి పనులు పూర్తి కావడంతో కంపెనీ మేనేజర్ సీఎస్.ఆర్.ప్రశాంత్ మహముని, సీనియర్ ఎగ్జిక్యూటివ్ అనపురపు సురేష్, స్థానిక సామాజిక మాజీ సర్పంచ్ సంధ్యభాస్కర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు సీనియర్ ఎగ్జిక్యూటివ్ అనపురపు సురేష్ మాట్లాడుతూ గ్రామస్థులకు, పిల్లలకు ఇబ్బందులు లేకుండా సీసీరోడ్డు వేసినట్లు తెలిపారు. అనంతరం మండల ప్రాథమిక పాఠశాలలో రూ.4లక్షలతో బాలుర బాలికలకు టాయిలెట్ బ్లాక్ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంధ్య భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ దేవిక శివారెడ్డి, స్కూల్ చైర్మన్ వెంకటేశం, సీనియర్ నాయకులు సీతారాంరెడ్డి, సైబెజ్ కంపెనీ ప్రతినిధులు ప్రశాంత్, మహాముని, సురేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కులకచర్ల, ఫిబ్రవరి 15: పుట్టపహడ్‌లోని కోదండ సీతారామ స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పల్లకీసేవ, ప్రత్యేక పూజలు నిర్వహించి నట్లు ఆలయ ధర్మకర్త విశ్వకర్మ రమేశ్ తెలిపారు. సీతారాముల కల్యాణోత్సవం, రాత్రి రథోత్సవం, శనివారం పల్లకీసేవ, సాయంత్రం శకటోత్సవం(బండ్లు తిరుగుట) నిర్వాహకులు రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతాయని తెలిపారు.

నేటి నుంచి ఇంటర్మీడియట్ ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష

వికారాబాద్, ఫిబ్రవరి 15: విద్యార్థులు ఇంగ్లీష్‌పై పట్టు సాధించేందుకు అనుగుణంగా ఈ సంవత్సరం తెలంగాణ ఇంటర్ బోర్డు తీసుకున్న చర్యల్లో భాగంగా శుక్రవారం(నేడు) జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఇంటర్ ఫస్టియర్ ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షలకు విద్యార్థులు హాజరుకావాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి ఎస్.శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష 20మార్కులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్యాచ్‌కు 50 మంది చొప్పున పరీక్ష ఉంటుందన్నారు. ఈనెల 17న ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష ఇంతకు ముందు పరీక్ష రాయని విద్యార్థులకు మాత్రమే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు హాజరు కాని విద్యార్థులు ఫెయిల్ అవుతారని తెలిపారు. హాల్‌టికెట్ల కోసం విద్యార్థులు చదువుతున్న కళాశాల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని సూచించారు.

సదరం శిబిరానికి స్లాట్ బుక్ చేసుకోవాలి

దోమ, ఫిబ్రవరి 15: ఈనెల 17వ తేదీ నుంచి మీసేవ కేంద్రాల్లో సదరం శిబిరానికి స్లాట్ బుక్ చేసుకోవాలని ఏపీఎం సురేశ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 19, మార్చి 8, 9, 16, 19, 30 తేదిల్లో తాండూర్ ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించే శిబిరానికి స్లాట్ బుక్ చేసుకున్న అంగవైకల్యం, బుద్ధి మాంద్యం, చెవుడు, మూగ దివ్యాంగులు హాజరు కావాలని కోరారు. అదే విధంగా ఈ నెల 20, 21, 23, 27, మార్చి 6, 22, 26, 27న తేదిల్లో వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించే శిబిరాలకు హాజరు కావాలని తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 15: అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని 11 గ్రామాల్లో గురువారం గ్రామసభలు జరిగాయి. ఎదులాబాద్‌లో జరిగిన గ్రామసభకు ఎంపీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి సమస్యలు లేకుండా చూడాలన్నారు. వేసవికాలం దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామసభల అనంతరం పంచాయతీ సిబ్బందిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఎంపీటీసీలు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **కులకచర్ల:** గ్రామసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజలు సహకరించాలని కులకచర్ల ప్రత్యేకాధికారి, తహసీల్దార్ మురళీధర్ తెలిపారు. మండల కేంద్రంలోని పంచాయతీలో గురువారం సంబంధిత అధికారులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్మికులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

● **కీసర:** సమాజంలో సాంఘిక దురాచారాలను అరికట్టాలని కీసర ప్రత్యేక అధికారి నందకిషోర్ అన్నారు. కీసరలో గురువారం గ్రామసభ నిర్వహించారు.

● **దౌల్తాబాద్:** రైతులు పీఎం కిసాన్‌కు ఈకేవైసీ చేసుకోవాలని వ్యవసాయ శాఖ మండల అధికారి శ్రీపతిరెడ్డి తెలిపారు. మండలంలోని కౌడీడ్, నందారం, నీటూర్, మాటూర్ గ్రామాల్లో రైతులకు గురువారం అవగాహన కల్పించారు. పట్టాదారు పాసుపుస్తకం ఉండి పీఎం కిసాన్ డబ్బులు ఖాతాల్లో జమ అవుతున్న రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

● **పరిగి:** ఉద్యోగులకు బదిలీలు సహజమని పరిగి మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. పరిగి మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసిన శ్రీనివాసన్ బదిలీపై కోల్లాపూర్ వెళ్లారు. కోల్లాపూర్‌లో కమిషనర్‌గా పనిచేస్తున్న వెంకటయ్య బదిలీపై పరిగి కమిషనర్‌గా రాగా వారిని సన్మానించారు.

● **కులకచర్ల:** గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర అన్నారు. మండలంలోని సాల్విడ్ సర్పంచ్ గడుసు బాలయ్య దంపతులు, వార్డు సభ్యులను గురువారం ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి పాల్గొన్నారు.

● **తాండూరు:** కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 16న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె నిర్వహిస్తున్నారు. గురువారం మున్సిపల్ కార్మికులు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

● **కొడంగల్ రూరల్:** జీవాలకు రైతులు విధిగా టీకాలను ఇవ్వాలని పశువైద్య శాఖ జూనియర్ వెటర్నరీ అధికారి వెంకటయ్య అన్నారు. కొడంగల్ మండలంలోని ఎరన్‌పల్లిలో గురువారం గొర్రెలు, మేకలకు అమ్మతల్లి వ్యాధి సోకకుండా వ్యాధి నిరోధక టీకాలు వేశారు.

● **పూడూరు:** మేడిపల్లి కలాన్ గ్రామానికి చెందిన ఎండీ ఖయ్యూం గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు వాటర్ ప్యూరిఫయర్ మిషన్‌ను ఏర్పాటు చేయించారు. గ్రామంలోని పాఠశాలలో గురువారం ప్యూరిఫయర్‌ను అమర్చారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఖాజామైనుద్దీన్, శ్రీనివాస్, మోసిన్ ఖాన్, అజ్జు పాల్గొన్నారు.

● **కీసర:** ఆలయ నిర్మాణానికి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌కుమార్‌రెడ్డి విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సాయంగా రామిడి విజయ్ కుమార్‌రెడ్డి రూ.25వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.శ్రీనాథ్‌శర్మ, శివ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


ఎల్‌వోసీ అందజేస్తున్న ప్రసాద్ కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 15: వికారాబాద్ పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన రేణుకాదేవి కొంత కాలంగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2లక్షలా 40వేల ఎల్‌వోసీని అసెంబ్లీ స్పీకర్, ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం ఆమెభర్త యాదగిరికి అందజేశారు. ఆర్థికంగా తమను ఆదుకున్నందుకు కుటుంబసభ్యులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ


సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 15: కొడంగల్ మండలంలోని రుద్రారం గ్రామంలో రూ.50లక్షలతో సీసీ రోడ్డు, సైడ్ డ్రైనేజీ పనులకు ఎంపీపీ ముద్దప్రదేశ్‌ముఖ్ పూజలు నిర్వహించి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తిచేయనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో గ్రామ సభ నిర్వహించి పంచాయతీ కార్యాలయంలో పనిచేసే పారిశుధ్య కార్మికులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ప్రత్యేకాధికారి విజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు నందారం ప్రశాంత్, ఆర్.ఆనంద్‌రెడ్డి, సాయిలు, అంబయ్యగౌడ్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో ఆత్మస్థైర్యం పెంపొందుతుంది


గెలుపొందిన టీమ్‌కు బహుమతి అందజేస్తున్న జగదీశ్వర్‌యాదవ్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 15: క్రీడలతో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ అన్నారు. మండలంలోని కొర్రెములలో ఈనెల 12వ తేదీన శ్రీరమేష్ హనుమాన్‌యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈపోటీల్లో ఫైనల్ మ్యాచ్‌లో రంగారెడ్డి, నల్లగొండ జట్లు తలపడగా నల్లగొండ బాలికల జట్టు గెలిచింది. ప్రథమస్థానం కైవసం చేసుకున్న జట్టుకు రూ.50వేల నగదుతో పాటు కప్, ద్వితీయస్థానంలో నిలిచిన రంగారెడ్డి జట్టుకు రూ.30వేల నగదుతో పాటు కప్ అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి మహేందర్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్‌పర్సన్ రజినిసాయిచంద్, ఎంపీటీసీ బొడ్డు వినోదనాగార్జున్, మాజీ సర్పంచ్ వెంకటేష్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ రాజు, బద్దం కుమార్, రమేష్ హనుమాన్‌యూత్ క్లబ్ సభ్యులు బొడ్డు పరమేష్, వెంకటేష్‌యాదవ్, మనోజ్, మల్లేష్, నర్సింగ్‌రావు, మహేష్, శివ, శ్రీహరి, బాబు పాల్గొన్నారు.

21 నుంచి బీజేపీ 'రాజరాజేశ్వర' బస్సు యాత్ర

తాండూరు, ఫిబ్రవరి 15: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఈనెల 21వ తేదీన తాండూరు నుంచి రాజరాజేశ్వర పేరిట బస్సు యాత్రను చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో 4రోజులు నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది మాదవరెడ్డి తెలిపారు. పార్టీ కార్యాలయంలో గురువారం జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, సీనియర్ నాయకులు రమేష్, శివకుమార్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. బస్సు యాత్ర తాండూరు, పరిగి, మన్నెగూడ, చేవెళ్ల మీదుగా సాగుతుందని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో ఏపార్టీతో పొత్తు ఉండదని, బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తుందని తెలిపారు. జనసేనా మద్దతు ఇస్తుందని తెలిపారు. అభ్యర్థులను ఢిల్లీలో అధిష్ఠానం ప్రకటిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు అంతారం లలిత, సాహు శ్రీలత, సీనియర్ నాయకులు ఎం. నరేష్, బంటారం భద్రేశ్వర్, తదితరులు ఉన్నారు.